

# తనపుత్రులు

ఆదిపల్లి నాగేశ్వరరావు

"ఏమండీ వద్దని రాయరూ" 'ఏమిటీ నాదస్తం! వాళ్ళబ్బాయిని వాళ్ళు తీసుకుపోతామని అంటున్నారు. దీనిలో మనము వద్దని రాయటమేమిటి నేను రాయను గాక రాయను' నేను నీకు మొదటనే చెప్పాను. ఇంకొకరి పిల్లలమీద వ్యామోహం పెంచుకోవద్దు తరువాత బాధపడవలసి వస్తుంది అనవసరంగా చిక్కుల్లో ఇరుక్కోటం నాకేం ఇష్టం లేదు కాదుకూడదని తీసుకువచ్చాక అనుభవించు అని విసావిసా నడచిపోయారు విశ్వనాథంగారు.

ఈయనకు చెపితే ఏమాత్రం అర్థంకాదు. సుభద్రమ్మగారు తలకాయ కొట్టుకుంది ఈయన ఎంత మరమనిషేమన్నా ఆశ్చర్యపడిపోయి మరలా అసలు సంగతి గుర్తుకొచ్చి, మనసులో కుములుతుంది. అసలు సంగతేమిటంటే ఆమె చెల్లెలు కమల కొడుకును వాళ్ళు రెండేళ్ళక్రితం దత్తతకు తెచ్చుకున్నారు. ఇప్పుడు కమలమ్మ మరది సత్యనారాయణ వాళ్ళబ్బాయిని వాళ్ళు తీసుకుపోతామని రాశారు. ఎందుకు రాశారో, ఏమిటో ఏమాత్రం తెలియదు. వాడిని రెండేళ్ళు సుభద్రమ్మగారు కళ్ళలో వత్తులువేసుకొని పెంచిందంటే విడ్డూరం ఏమిలేదు. ఇప్పుడు అకస్మాత్తుగా ఆ ఉత్తరం రావటంతో మతి పోయినట్లయి అటుఇటు తిరుగుతున్నది.

అక్కడేమో కమలమ్మ మొగుడిని పదేపదే అడుగుతున్నది. "ఇదుగో ఏమండోయ్, రాశారా బదులు మాట్లాడరేం." అదికాదే కమలా అప్పుడు యిచ్చేశాంకదా, ఇపుడు మరలా మనము తీసుక వస్తే ఏం బాగుంటుంది? మన రాజు ఇక్కడికన్నా అక్కడే సుఖంగా వుంటాడు. నాకన్నా ఈ సంగతి నీకు బాగా తెలుసు. అయినా నీ మొండిపట్టుదల నాకేమి అర్థం కావటం లేదు. చెప్పుడు మాటలు విని నీ బుద్ధి అంతా పెడత్రోవ పట్టింది. నా మాట విను మనకు ఇద్దరాడపిల్లలున్నారు. ఇంకా వయసున్నది. మనము ముసలివాళ్ళము కాము. వాళ్ళు ముచ్చటపడి అడిగినపుడు మెహర్బానీగా 'సరేలెండి వదినగారూ' అన్నాను. ఇపుడు నీవు తీసుకురమ్మంటే ఏలాగు తీసుకువస్తాను! ఏం బాగుంటుంది!" అని అనేక రకాలుగా నచ్చచెపుతున్నాడు. కాని కమలమ్మ ససేమిరా అంది. 'ఇదిగో చూడండి! బాబు శ్రేయస్సు గురించి మీకంటే నేను ఎక్కువగా ఆలోచిస్తాను. మీరు రేపు సాయంత్రములోగా పోకపోతే నేను పోయివస్తాను." "అయితే యిద్దరముపోదాములె ఇది అసలే ఆడవాళ్ళ కాలమాయె" అనుకుంటూ సత్యనారాయణ రాజీపడ్డాడు. అంతిమ విజయము కమలమ్మదే ఆ యింట్లో.

ఉత్తరానికి మరునటిరోజుకూడ జవాబు రాలేదు ఇదిచూచి కమలమ్మ, సత్యనారాయణ ఇద్దరూ అక్కగారింటికి బయలుదేరి వెళ్ళారు. జరుగబోయేది ఊహించినా మొదలే బయటపడట మెందుకని సుభద్రమ్మ నవ్వుమొహంతోనే ఆహ్వానించింది. చెల్లెలిని కుశల ప్రశ్నలు వేసింది. మరిదిగారికి మర్యాద చేసింది. కాఫీ ఫలహారాలు ఇచ్చింది.

"ఏమిటండీ, ఏమి మాట్లాడరేమిటి? ఈ మర్యాదలన్నీ చూసి వచ్చినపని మరచిపోయారా!" అంది కమలమ్మ అక్కగారు వంటయింట్లోకి పోగానే అడుగుదాము లేవే తొందర ఎందుకు నెంతా తొందర వ్యవహారము వచ్చిన వాళ్ళము? అడగకుండా, తీసుకపోకుండా పోముగా, కొస్త నీ నోరు కట్టిపెట్టు అని సన్న సన్నగా మందలించాడు సత్యనారాయణ మూతి మూడు వంకర్లు తిప్పింది కమలమ్మ.

అంతలోకె రాజు వచ్చాడు వాడు ఎంతో పుష్టిగా ఆరోగ్యముగా ఉన్నాడు చక్కని గళ్ళషర్టు నిక్కరు తొడుక్కొని బంతితో ఆడుకుంటున్నాడు. సుభద్రమ్మ గారిని చూడగానే ఆమె దగ్గరకు పోయినాడు రారా బాబు రా అమ్మాయి కమలా బాబుకు స్నానం చేయించి తీసుక వస్తానమ్మా అని అంది. బాబు యిలా రామ్మా నీ కోసం చాకెలెట్లు బిస్కట్లు తెచ్చానమ్మా! అంది కమలమ్మ.

పో నాకేమి వద్దు పో! మా అమ్మదగ్గర ఉన్నాయిగా అని గెంతుకు లోపలకు పోయాడు. చూడండి వాడు స్వంత అమ్మని కూడ గుర్తుపట్టలేక పోయినాడండి వాడు నాకు దూరమయి పోతున్నాడండి రెండేళ్ళ బాధంతా అప్పుడే వెళ్ళబుచ్చింది కమలమ్మ

సరేలె ఇంక నీగోల ఆపు. తీసుక పోవటానికే వచ్చాముగా తడవకు ఒకసారి రికార్డు పెడతావెందుకు అని కసిరాడు సత్యనారాయణ.

అసలు సంగతి తెలిసినా తేలు కుట్టిన దొంగల్లాగ ముగ్గురు పైకి తేలటం లేదు. అంతలోనె విశ్వనాథంగారు వచ్చారు. ఏమమ్మా క్షేమమా! ఏం తమ్ముడూ కులాసానా! అని ఆప్యాయంగా పలకరించారు. ఆయన కాళ్ళు కడుగుకోటానికి వెళ్ళంగానే నేను అన్నయ్యగారిని సాయంత్రము బజారు తీసుకపోయి అడుగుతాను, నీవేమి తొందర పడకు అన్నాడు సత్యనారాయణ.

పిండి వంటలన్ని దడ దడలాడే గుండెలతో చేసి వడ్డించింది, తుష్టిగా తిని లేచారు దంపతులు. సాయంత్రము నాలుగు గంటలయింది, తమ్ముడూ అలా బజారుకు వెళదాం వస్తావా అని అడిగాడు విశ్వనాథంగారు సత్యనారాయణ మొహం కడుకొని బయలు దేరాడు.

అన్నయ్యగారు ఆఁ! అని ఒకటే పలకయిస్తున్నాడు. ఆ అవస్థ చూచి తమ్ముడూ మీరిద్దరు ఎందుకు వచ్చారో నాకు తెలుసు, నాకేమి అభ్యంతరము లేదు. దాని విషయము రాత్రికి చెప్పి

దానిని ఒప్పిస్తాను. దానికి నేను మొదటే చెప్పాను ఎందుకే అనవసరంగా మమతలు పెంచుకుంటావు. చివరకు మిగిలేది విశాదమే కదా ! అని ఎంతో చెప్పాను. అయినా నా మాట వినలేదు.

అన్నగారి మాటలకు సత్యనారాయణ మొహం చిన్నబోయినా వెంటనే సద్దుకున్నాడు. ఇద్దరు ఇంటికి రాగానే చెప్పారా లేదా అని అర్ధమొచ్చేటట్లు కండ్లు మూస్తు తెరుస్తు చేతుల్తో అభినయం చేసింది కమలమ్మ. సత్యనారాయణ మౌనంగా తల పంకించాడు.

ఆఖరుకు కుంత బద్దలుగాక తప్పలేదు. సుభద్రమ్మగారు కంటికి మంటికి ఏక ధారగా ఏడుస్తున్నది. ఎంత ఏడ్చినా కమలమ్మ పసేమిరా అన్నది బాబు నేను రాను. నేను మా అమ్మదగ్గరనే ఉంటానని ఏడుపు సాగించాడు. వాడికి ఎట్లాఅర్థమయిందో ఏమో వాళ్ళు తనను తీసుక పోవటానికి వచ్చారని తెలుసుకున్నాడు. అది చూచి సుభద్రమ్మ ఒకింత ఆనందం పొందుతూ మరొకింత దుఃఖము అనుభవించ సాగింది, బాబుకు ఎన్నోమాటలుచెప్పి ఊరడించింది, ఎన్నో నీతులు చెప్పింది. బాబు అలవాట్ల గురించి పద్ధతుల గురించే ఎన్నోసార్లు చెప్పింది. ఆఖరకు బాబుకు ఏమంటే యిష్టమో ఏమంటే యిష్టంలేదో పలుమార్లు చెప్పింది. ఈ చెప్పటం చూసి కమలమ్మ ఈమె నాకు ఇన్నిబోధలు చేస్తుందేమిటి ఆమెకన్నతల్లి అయినట్లు నేను పెంపుడుతల్లి అయినట్లు అని పైకి విసుక్కోబోయి భర్త చూపులతో లోపలికే మింగేసింది. బాబుని తీసుకొని ఎలాగో వాళ్ళు ఊరు చేరారు.

వారిని రైలెక్కించి రాగానే ఒక్కసారి బోరుమంది సుభద్రమ్మగారు. "బాబు లేకపోతే నాకేమి తోచదండీ ఒక్కసారి ఈ నిశ్శబ్దాన్ని నేనెలాగు భరించగలనండి" అని ఒకటేమోస్తరు బాధపడ సాగింది.

"చూడు సుభద్రా నీవు చిన్నపిల్లవుకావు నీవింత బెంగటిల్లిపోవటం ఏమాత్రం బాగోలేదు. మనసు సర్దుకో" అని ఎన్నోవిధాల సముదాయించారు విశ్వనాధంగారు. ఎలాగయినా మనబిడ్డకాదుగదా అని పాపం ఆమె చివరకు మనసుచిక్కబట్టుకొని కాలక్షేపం చేయసాగింది. బాబులేనికొరత కానరాకుండా గ్రంథాలు కథలల్లో మునిగి తేలుతున్నది

ఇంటికి చేరగానే అక్కలిద్దర్నిచూసి బాబు చిక్కమొగం వేశాడు. "సుమా ఉమా తమ్ముడొచ్చాడమ్మా ఆడుకోండి. ఈ చాకెలెట్లు ముగురూ తినుకోండి" అని గుప్పెడు తీసి యిచ్చింది కమలమ్మ. ఉమ రెండవపిల్ల, చిన్నది ఏమితెలియదు. "అక్కా మన తమ్ముడు చిన్నవాడుగదా వాడికి చాకెలెట్లు ఎందుకు మనమే తిందామన్నది. విశ్వనాధంగారింట్లో అన్నీ వాడికే ఏది కావాలంటే అది తెచ్చిచ్చేవారు. ఇక్కడ అసలు చేతికి రాలేదు. ఏడుపు సాగించాడు బాబు.

ఇంట్లో పొద్దస్తమానమూ ఒకటే పోట్లాటలూ తగాదాలూ. కమలమ్మ విసిగి పోయింది. ఒక సారి బాగా కోపంవచ్చి బాబుని చితక బాదింది కమలమ్మ. మొదటివాడు పెద్దమ్మ గురించి దిగులుగా ఉన్నాడు. దీనితో వాడికి జ్వరం పట్టుకుంది.

సుభద్రమ్మగారు మనసుకు శరీరానికి విశ్రాంతి తీసుకుంటూ చాలవరకు బాబుని మర్చి పోవటానికి ప్రయత్నించింది. ఆ విషయంలో చాల మటుకు కృతకృత్యురాలు కాగలిగింది కూడ.

ఇక్కడ మాత్రం బాబు పరిస్థితి ఏమి బాగో లేదు. అమ్మ అమ్మ అని ఒకటే కలవరిస్తున్నాడు. కమలమ్మ దగ్గరకు పోతె నీవు మా అమ్మవుగావు అని తీసిపార వేస్తున్నాడు. పరిస్థితి చాల ప్రమాదకరంగా పరిణమిస్తున్నది. ఏమండీ అక్కయ్యకు ఒకసారి ఉత్తరం వ్రాయండి. బాబును చూచి పోవచ్చుని బాబును తీసుక పోవచ్చని కూడా వ్రాయండి." అని కోరుకున్నది కమలమ్మ.

"అంతా నీ యిష్టమేనా, నీ ఆజ్ఞ ప్రకారం అంతా జరగాల్సిందేనా ఏమిటి ? రమ్మనటం, వద్దనటం. మళ్ళా తీసుక పొమ్మని వ్రాయటం, ఏం తమాషాగా ఉన్నదా ఇంతమటుకు మనం వారికి చేసింది చాలుకాని. ఇంక యిటువంటి మాటలు నా దగ్గరకు తేకు" అని కసిరాడు సత్యనారాయణ.

బాబు పరిస్థితి చూచిన తరువాత సత్యనారాయణకు కూడ మనసాగక ఎక్స్‌ప్రెస్ డెలివరీ రాశాడు, వెంటనే టెలిగ్రాంకూడ యిచ్చాడు. టెలిగ్రాం చూడగానే 'త్వరగా బయలుదేరు, సుభద్రా. బాబుకు ప్రమాదంగా వుందిట." అన్నారు విశ్వనాథంగారు ఆదుర్దాగా.

"బాబుకు ప్రమాదంగా ఉంటే మనముపోయి ఏం చేస్తామండీ నేనురాను. నాకు ఎందుకో రావాలనిపించటంలేదు." అన్నది సుభద్రమ్మగారు. "ఐతే దానివే సుభద్రా. బాబుమీదకాని కమలమ్మ సత్యనారాయణ వాళ్ళమీద కోపంగా ఉందేమిటి త్వరత్వరగా బయలుదేరు" అన్నాడు విశ్వనాధంగారు. "బాబుపై కోపమేమిటి ఎందుకో రావాలనిపించటం లేదు. అంతే, అయినా మీ మాట కాదనలేను, పోదాంపదండి" అని వెంటనే బయలుదేరి వెళ్ళారు.

వాకిట్లో చూస్తూనే అక్కయా అని కాళ్ళమీద పడింది కమలమ్మ, మౌనంగా లేవనెత్తి బాబు దగ్గరకు పోయింది సుభద్రమ్మగారు. అమ్మా అని వాడు కౌగలించుకున్నాడు. ఆమె చిత్తరపోయింది. బాబు వీడేనా, బొద్దుగా అందంగా ఉన్నబాబు వీడా ! ఏవి ఆ బుగ్గలు. ఆ కాళ్ళేమిటి ? అంత సన్నంగా ఉన్నాయి. బుగ్గలేమిటి అంతలోపలకు పోయాయి. ఆశ్చర్యపడింది సుభద్రమ్మగారు. విశ్వనాధంగారు కూడ బాబు పరిస్థితి చూసి చాల జాలిపడ్డారు.

వాళ్ళు యింట్లోకి పోగానే, 'చూశారా, మన మాట వాళ్ళెప్పుడు కాదనలేరండి. నాకుతెలుసు, మివి అన్నీ అనవసరపు అనుమానాలు. అక్కయ్యా సాధిస్తుందన్నారుగా, బావగారుకూడ నోరు విప్ప లేదు. చూడండి" కమలమ్మ మాట్లాడటం మొదలు పెట్టింది. "వెనుకటి ధోరణిలో నీవు ఉన్నావుగా అందరిబదులు బడబడ వాగటానికి" అని విసుక్కున్నాడు సత్యనారాయణ. నేనేమి అన్నానండీ అని అవతలకు పోయింది కమలమ్మ.

సుభద్రమ్మగారు వచ్చిన వేళావిశేషం బాబు కోలుకున్నాడు. మామూలుగా ఆరోగ్యంగా తిరుగసాగాడు. "ఇక మనం వెళదామండీ" అని విశ్వనాథంగారిని కదిపింది. భార్య మనసు ఆయన చక్కగా అవగాహన చేసుకున్నాడు కాబట్టి ఆయన వెంటనే సరేనన్నాడు. సరే యింక వెళ్ళిరా" అన్నారు విశ్వనాథంగారు.

అమ్మా, కమలా ! మేము వెళతామమ్మా" అన్న వాళ్ళను చూసి కమలమ్మ, సత్యనారాయణ విశ్చేష్టులయినారు. బాబ్ని బాబును మళ్ళీ వాళ్ళతో పంపుదామనుకుంటున్నారు. 'అదేమి టక్కయ్యా ! బాబుని" అని ఇంకా ఏమిటో మాట్లాడబోతుంటే "ఎందుకమ్మా నెలకొకసారి వచ్చి చూసి పోతుంటాముగదా' అని అన్నది సుభద్రమ్మగారు.

ఇంక వారికి ఎంత చెప్పినా వినరని సత్యనారాయణ వారిని బస్సు ఎక్కించి వచ్చాడు. దారిలో నీవు కొద్దిగా మృదువుగా చెప్పి వుండవలసింది సుభద్రా" అన్నారు విశ్వనాధంగారు. ఆమె ఏమి మాట్లాడకపోవటంచూసి "పోనీ అనాధాశ్రమమునుండి ఎవరినయినా తెచ్చుకుందామా" అన్నారు 'వద్దండీ మమతకు నాకు ఇనుపతెరలు పడిపోయినాయి. అవి తీసివేయటం నాకు చేతకాదు. నాకు మీరున్నారు. మీకు నేనున్నాను. మనిద్దరికు దేవుడున్నాడు" అన్నది సుభద్రమ్మగారు దృఢంగా.

★



— వరశ్రీ